ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 142 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 31 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## జూరాలకు కొనసాగుతున్న వరద

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు30(ప్రభాత ఉదయం)ఎగువ ప్రాంతంలోని కర్ణాటక జలాశయాల నుంచి వస్తున్న నీటి ఉధృతితో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో శుక్రవారం జూరాల అధికారులు 45 స్పీల్ వే గేట్లు ఎత్తివేసి నీటిని దిగువనకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 అడుగులకు గాను ప్రస్తుత నీటిమట్టం 317.840 అడుగులకు చేరింది పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుత నీటి నిలువ 8.300 టీఎంసీలుగా నమోదయింది. జూరాలకు ఇన్ ఫ్లో 3.21లక్షల క్యూసెక్కులుగా ఉండగా దిగువకు శ్రీశైలం వైపు 3.29లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టుపై ఆధారపడిన నెట్టెంపాడు, బీమా ఎత్తిపోతల పథకాలతో పాటు కుడి, ఎడమ కాలువకు సాగు నీటిని యధావిధిగా విడుదల చేస్తున్నారు.



## టీటీడీ తరహాలో
# యాదగిరిగుట్ట అభివృద్ధి



### యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు
### హైదరాబాద్ బయట మరో జూపార్క్
### స్పీడ్ ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్ట్ 30 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి నూతన విధానం రూపొందించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. 'స్పీడ్' ప్రాజెక్టులపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఎకో, టెంపుల్ పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలని చెప్పారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాదగిరిగుట్ట అభివృద్ధిపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. తితిదే బోర్డు

..మిగతా 2లో

సుప్రీంకోర్టుకు
**బేషరతు క్షమాపణ**
న్యాయవ్యవస్థపై అత్యంత గౌరవం ఉంది
ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి
2

### సీఎం రేవంత్‌ను కలిసిన వేములవాడ అర్చక బృందం
#### ఆలయ విస్తరణ పనులపై చర్చ

హైదరాబాద్, ఆగస్ట్ 30 (ప్రభాత ఉదయం): సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వేములవాడ ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆలయ ఈవో వినోద్, స్థపతి వల్లినాయగం, ఈ ఈ రాజేష్, డీఈఈ రఘునందన్, ఆలయ ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ, తదితరులు ఉన్నారు. వేములవాడ ఆలయ విస్తరణకు బడ్జెట్లో రూ.50కోట్లు కేటాయించినందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ అర్చకులు, అధికారులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ విస్తరణకు సంబంధించిన డిజైన్స్, నమూనాకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాల్సి ఉందని సీఎంకు ఆలయ అర్చకులు తెలిపారు. వెంటనే వెళ్లి శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.





## 15 ఏళ్లుగా నత్తనడకన
# దేవాదుల ప్రాజెక్ట్

### దేవాదుల ప్రాజెక్టును సందర్శించిన మంత్రుల బృందం
### పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించిన మంత్రులు
### ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి.. పనుల పురోగతిపై సమీక్ష

ములుగు, ఆగస్ట్ 30 (ప్రభాత ఉదయం): 15 ఏళ్లుగా దేవదుల ప్రాజెక్ట్ నత్తనడకగా సాగుతోందని, 2026 మార్చి నాటికి పూర్తి చేసి, సోనియా గాంధీతో ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. 300 రోజుల పాటు నీటి ఎత్తిపోసేలా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తాం అన్నారు.. పెండింగ్ బిల్ అన్ని క్లియర్ చేస్తాం అన్న మంత్రులు.. పొరుగు రాష్ట్రాల తో సత్ సంబంధాలతో ఉంది త్వరితగతిన ప్రాజెక్టు పనుల చేపడతాం అన్నారు. గత ప్రభుత్వం కేవలం పనులు చేశారు జేబులు నింపుకున్నారు కానీ ప్రజలకు లాభం జరగలేదు. లక్ష 80 వేల కోట్లు ఇరిగేషన్

..మిగతా 2లో

# పేదల ఇళ్లపైకి బుల్‌డోజర్లు
### పాలమూరులో రోడ్డున పడ్డ 75 కుటుంబాలు



### వెంటనే ఆపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కేటీఆర్ సూచన

హైదరాబాద్, ఆగస్ట్ 30 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లు పంపుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.మీరు చెప్పినట్లుగా, ఒకరి ఇంటిని కూల్చివేసి, వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చడం అమానవీయం, అన్యాయం అని మల్లికార్జున్ ఖర్గేను ఉద్దేశించి కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. పేదల ఇళ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్‌లు పంపుతుంది. రాష్ట్రం బుల్డోజర్ రాజ్యంగా

..మిగతా 2లో

## శివాజీ విగ్రహం కూలిన ఘటనపై
# ప్రధాని క్షమాపణ



న్యూఢిల్లీ, ఆగస్ట్ 30 (ప్రభాత ఉదయం): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహారాష్ట్ర పర్యటన సందర్భంగా శుక్రవారం (ఆగస్టు 30) పాల్ఘర్‌లోని వాధావన్ పోర్ట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దాదాపు రూ.1,560 కోట్లతో చేపల పెంపకం ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని సింధుదుర్గ్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూలిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు .2013లో బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించినప్పుడు రాయ్‌గఢ్ కోటకు వెళ్లి ప్రార్థన చేశానని ప్రధాని మోదీ అన్నారు. ఒక భక్తుడు తన ఆరాధ్యదైవాన్ని ఎలా ఆరాధిస్తాడో అదే భావనతో దేశానికి సేవ

..మిగతా 2లో

## ట్రంప్‌ను ఓడించడానికి
# అంతా సిద్ధం
### తొలి ఇంటర్వ్యూలో కమలా హ్యారిస్



న్యూఢిల్లీ, ఆగస్ట్ 30 (ప్రభాత ఉదయం): వాషింగ్టన్: అమెరికా ప్రజలు డొనాల్డ్ ట్రంప్‌ను ఓడిరచడానికి సిద్ధంగా ఉన్నారని డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ అన్నారు. డెమోక్రాట్ల తరఫున అధ్యక్ష అభ్యర్థిగా ఖరారైన తర్వాత ఆమె తొలిసారిగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. అక్రమ వలసలపై తాను కఠినంగా వ్యవహరిస్తానని చెప్పారు. చమురు, సహజవాయువు నిక్షేపాలను వెలికితీసేందుకు మద్దతిస్తానని చెప్పిన హారిస్, తన ఉదారవాద లక్షణా లను మాత్రం విడిచిపెట్టలేనని

..మిగతా 2లో

## సెప్టెంబర్ 4 మహా ధర్నాను
# విజయవంతం చేయాలి
### విద్యుత్ ఓసి, బీసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి




నానల్ నగర్ చౌరస్తాలో గల విద్యుత్ కార్యాలయంలో పోస్టల్ విడుదల చేస్తున్న ఓ సి, బి సి ఉద్యోగుల జేపీసీ నాయకులు

మెహదీపట్నం, ఆగస్టు30(ప్రభాత ఉదయం) దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు చేసి ఉద్యోగ పదోన్నతులు కల్పించాలని విద్యుత్ ఓసి, బీసీ ఉద్యోగుల కార్యాచరణ సమితి సెప్టెంబర్ 4న తలపెట్టనున్న మహాధర్నా ను విజయవంతం చేయాలని ఓసి ఉద్యోగ సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, డిస్కం బిసి సంఘం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ చంద్రుడు రాష్ట్ర బీసీ ఉద్యోగ సంఘం నాయకుడు బ్రహ్మేందర్ , రాజేంద్రనగర్, సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ ల ఓ సి బి సి ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం మెహిదీపట్నం నాన్నల్ నగర్ లోని విద్యుత్ సిబర్ సిటీ, రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాల లో పనిచేస్తున్న ఓ సి, బి సి ఉద్యోగుల జేఏసీ సెప్టెంబర్ 4న తలపెట్టనున్న మహాధర్నా పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.... తాము ఏ వర్గానికి వ్యతిరేకం కాదని సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకొని ఓసి, బిసి లకు పదోన్నతుల్లో ఆర్డర్ ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైబర్ సిటీ, రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఏ ఓ లు ఎం.పి రవికుమార్, వీరస్వామి, అకౌంట్స్ ఆఫీసర్లు మురళి గౌడ్, మనోహర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు నాగరాజు, ఎం శ్రీనివాస్ రెడ్డి, అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.



## రామ్‌నగర్‌లో
# హైడ్రా కూల్చివేతలు
### నాలా ఆక్రమణలను కూల్చేసిన అధికారులు

హైదరాబాద్, ఆగస్ట్ 30 (ప్రభాత ఉదయం): హైదరాబాద్‌లోని అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లో 'హైడ్రా' కూల్చివేతలు చేపట్టింది. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ కాలనీలో నాలాను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దీనిపై నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీ రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. నిర్మాణాలు అక్రమమే అని నిర్ధరించిన అనంతరం హైడ్రా అధికారులు శుక్రవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. ఇక్కడ విక్రమ్‌యాదవ్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో అక్రమంగా కల్లు కాంపౌండ్ కొనసాగుతోందని స్థానికులు రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారని అందులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన యంత్రాంగం అక్కడి కల్లును పారబోసి పూర్తిగా సామగ్రిని తొలగించి.. కూల్చివేతలు చేపట్టింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే హైడ్రా చర్యలకు ఉపక్రమించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట అభివృద్ధి

**మొదటి పేజీ తరువాయి...**

మాదిరే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధిలో పెండింగ్ పనుల వివరాలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై వివరాలు ఇవ్వాలని సూచించారు. ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులు వేగవంతం చేయాలన్నారు. ఆలయ అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆపవద్దని స్పష్టం చేశారు. వైటీడీఏ, యాదగిరిగుట్టకు సంబంధించి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతి కుమారి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## ట్రంప్‌ను ఓడించడానికి అంతా సిద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె ట్రంప్ పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన అమెరికన్లను, అమెరికన్ల శక్తి సామర్థ్యాలను తక్కువ చేసే అజెండాతో పనిచేస్తున్నారని ఆరోపణలు చేశారు. అలాంటి వ్యక్తిని ఓడిరచేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని హారిస్ పిలుపునిచ్చారు. తాను అధికారంలోకి వస్తే కేబినెట్‌లోకి రిపబ్లికన్‌ను తీసుకుంటానని కమలా హారిస్ ఆసక్తికర ప్రకటన చేశారు. అక్రమ వలసలపై ఉదారంగా వ్యవహరించానని తనపై వస్తున్న ఆరోపణలను ఆమె కొట్టి పారేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ చమురు వెలికితీతను నిషేధించబోనని ఆమె స్పష్టం చేశారు. తద్వారా పెన్సిల్వేనియో వివాదానికి ఆమె తెరదించారు. అధ్యక్ష ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేసే కీలక రాష్ట్రాల్లోఇది కూడా ఒకటి. గాజా కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్ విషయంలో అధ్యక్షుడు బ్కెడెన్ విధానాలను కొనసాగిస్తానని ఆమె పేర్కొన్నారు. ఇదిలావుంటే డొనాల్డ్ ట్రంప్‌కు సొంత పార్టీ నాయకులు భారీ షాకిచ్చారు. సుమారు 200 మంది రిపబ్లికన్లు, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మద్దతు ప్రకటిస్తూ లేఖ రాయడం ట్రంప్‌ను షాక్‌కు గురిచేసింది. అయితే వీరంతా జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో వీరంతా ఆయనకు అనుకూలంగా పనిచేసినవారే కావడం గమనార్హం. ఫ్యాక్స్ న్యూస్ కథనం ప్రకారం వీరంతా 2020లో కూడా ట్రంప్ పోటీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలుస్తోంది. వీరంతా ట్రంప్‌కు వ్యతిరేకంగా తీర్మాణం చేశారు. ట్రంప్‌ని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే ప్రజాస్వామ్యాన్ని కోలుకోలేని దెబ్బతీస్తారని ఆ లేఖలో హెచ్చరించారు. కమలా హారిస్‌తో మాకు సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నప్పటికీ, ఆ స్థాయిలో దేశానికి సేవ చేసే నాయకులు ఇంకెవరూ ప్రస్తుతం లేరని వారు లేఖలో పేర్కొన్నారు. ట్రంప్‌ను ఓడిరచడానికి జార్జ్ హెచ్ డబ్ల్యూ బుష్ మద్దతుదారులమతా ఒక్కటవుతామని హెచ్చరించారు.

## పేదల ఇళ్లపైకి బుల్‌డోజర్లు

**మొదటి పేజీ తరువాయి...**

మారకుండా సీఎంకు ఖర్గే సలహా ఇవ్వాలి. నోటీసులు ఇవ్వకుండా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 75 ఇండ్లను కూల్చేశారు. ఈ 75 కుటుంబాల్లో దాదాపు 25 కుటుంబాలు వికలాంగులకు చెందినవి. రాష్ట్రంలో చట్టం, న్యాయ వ్యవస్థ పట్ల ధిక్కారం జరుగుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.తెలంగాణను మరో బుల్‌డోజర్ రాజ్‌గా మారకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి సలహా ఇవ్వాలని కోరారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని 75 పేదల ఇళ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎటువంటి నోటీసులు లేకుండా కూల్చి వేశారు. నిన్న అక్రమంగా కూల్చివేసిన నిరుపేదల్లో 25 కుటుంబాలు శారీరక వికలాంగులు ఉన్నారు. ఆమోదయోగ్యమైన పద్ధతులు పాటించ కుండా, విధి విధానాలు లేకుండా అమలు చేసే చట్టం చట్టమే కాదు. అడ్డగోలుగా నిరుపేదలపైకి బుల్డోజర్ నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి.. తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్?గా మార్చకుండా ఆదేశాలు ఇవ్వండి' అని కేటీఆర్ సూచించారు.

## దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



కొత్తకోట, ఆగస్టు 30(ప్రభాత ఉదయం) వర్షాకాలంలో నిలువ నీరు ఉండకుండా ఎప్పటికప్పుడు డ్రై డే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించి దోమలు వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్, అధికారులను వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమం సందర్భంగా కొత్తకోట మున్సిపాలిటీ లోని 4, 11,వార్డుల్లో తనిఖీలు నిర్వహించారు. అలాగే కొత్తకోట మండలం నాటెవల్లి గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జ్వరం వచ్చిన ప్రాంతంలో పారిశుధ్య పనుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. చుట్టుప్రక్కల ప్రాంతంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయించి పాజిటివ్ వచ్చిన ఇంట్లో పేరత్ర్యన్ మందు పిచికారి చేయించాలని ఆదేశించారు. వైద్య, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పని చేసి మరిన్ని పాజిటివ్ కేసులు కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. నాటేవల్లి మండల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్‌లి కొత్తకోట మండలంలోని నాటేవల్లి మండల ప్రాథమికోన్నత పాఠశాలను కలక్టర్ సందర్శించారు. పాత పాఠశాల భవనం శిధిలావస్థలో ఉండటాన్ని గమనించిన కలక్టర్ మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి రేపటిలోగా ఇవ్వాలని పంచాయతీ రాజ్ డి. ఈ ని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేసిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సాయినాథ్ రెడ్డి, డా. ప్రవలిక, కొత్తకోట మున్సిపాలిటీ చైర్మన్ సుకేశిని విశ్వేశ్వర్, ప్రత్యేక అధికారి స్వరన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ సూర్య కుమార్, కౌన్సిలర్ కొమ్ము భరత్ భూషణ్, కృష్ణారెడ్డి,ఎంపీడీఓ లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## అమ్మవార్లకు వైభవంగా వెండి కవచ అలంకరణ మహోత్సవం

కొత్తకోట, ఆగస్టు 30(ప్రభాత ఉదయం) పట్టణం లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని వాసవీ మాత సహిత శ్రీ లక్ష్మీ , శ్రీ సరస్వతీ మాత అమ్మవార్లకు శ్రావణ మాసం చివర శుక్రవారం సందర్భంగా వనపర్తి జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు గుంత మౌనిక మల్లేష్ , కొత్తకోట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుంత సురేష్ , ఆర్యవైశ్య మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కొండ స్వప్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేవాతా మూర్తులకు వెండి చీరలను అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ప్రాతః కాల సమయం లోనే ముగ్గురు అమ్మవార్లకు పంచామృతాలతో ప్రత్యేక అభిషేఖాలు నిర్వహించి , దాదాపు 20 కేజీల వెండితో స్వర్ణకారులచే చేయించిన ముగ్గురు అమ్మవార్ల వెండి కవచాలను ఆలయం వరకు శోభయాత్రగా తీసుకుని వచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు , హెూమాలు నిర్వహించి అమ్మవార్లకు అలంకరించడం , అమ్మవారికి యెంతో ప్రీతిపాత్రమైన అరుదుగా లభించే కదంభ పుష్పాలు , కలువ పూలచే అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు.ప్రత్యేక ఆకర్షణగా అష్టలక్ష్మీ మండపాల అలంకరణ నేటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం నుండి వచ్చినవారు వాసవీ మాత సహిత , అష్టలక్ష్మీ మండపాలను రకరకాల పుష్పాల చేత అలంకరణ అందరినీ ఆకట్టుకోవడం తో ప్రత్యేకత ఏర్పడింది. ఈ మండపాల అలంకరణ దాతలు విశ్వనాథం లక్ష్మీ వేంకటరమణ ముందుండి ఏర్పాట్లను చేశారు.అమ్మవార్లకు వెండి చీరలను బహుకరించిన దాతలను సన్మానించి అమ్మవారి ఆశీర్వాదములతో పాటు ప్రసాదం అందజేయడం జరిగింది.పూజా కార్యక్రమాల సందర్భంగా మెడిశెట్టి జ్యోతి శ్రీనివాసులు , గుంత సహన సురేష్ అల్పాహారం,అన్నదానం ఏర్పాటు చేశారుఇట్టి పూజా కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీమతి కవిత పాల్గొని అమ్మవారు ఆశీర్వాదం తీసుకున్నారు పూజా కార్యక్రమాలలో పట్టణ ఆలయ కమిటీ సభ్యులు గుంత మల్లేష్ , విశ్వనాథం గంగాధర్ , భీమ బాలకృష్ణ , కండే నరేష్ , అర్థం అనిత తదితర మహిళలు పాల్గొన్నారు.

# 15 ఏళ్లుగా నత్తనడకన దేవాదుల ప్రాజెక్ట్

**మొదటి పేజీ తరువాయి...**



శాఖ పైనా ఖర్చు చేసిన గత బిఆర్ఎస్ పాలకులు పనుల పేరుతో జేబులు నింపుకున్నరని అన్నారు. ప్రాజెక్టుల పని పేరుతో గత ప్రభుత్వా నేతలు దోచుకున్నారని విమర్శించారు. ములుగు జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల పంపింగ్ స్టేషన్ ను సందర్శించి, ప్రాజెక్టు ఇంటెక్ వెల్, పంప్ హౌస్ ను పరిశీలించారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయడంపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. 2025 డిసెంబర్ నాటికి దేవాదుల ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. 2026 మార్చ్ లో సోనియాగాంధీ చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 38 టీఎంసీల నీరు ఎత్తిపోయడానికి ప్రాజెక్ట్ డిజైన్ చేశారని ప్రస్తుతం సమ్మక్క బ్యారేజ్ నిర్మాణం వల్ల 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందన్నారు మంత్రి ఉత్తమ్. సంవత్సరంలో 300 రోజులపాటు 60 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి 5.57 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. గత పది ఏళ్ల కెసిఆర్ హయంలో దేవాదుల ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని, కమిషన్ల కక్కుర్తి కోసం కేసీఆర్ ప్రాజెక్టులను ఆగం చేశారని మంత్రి ఉత్తమ్. మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ అడ్డుపెట్టుకుని కేసీఆర్ దోపిడీకి తీరలేపారని ఫైర్ అయ్యారు. ప్రతి ప్రాజెక్టులోను వేలకోట్ల స్కాం జరిగిందని ఆరోపించారు. 1.81 లక్షల కోట్ల నిధులను ఇరిగేషన్ శాఖకు ఖర్చుచేసినా లక్ష ఎకరాలకు అదనంగా సాగునీరు ఇవ్వలేకపోయారన్నారు. 14 వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉంటే, 7వేల కోట్లను తమ ప్రభుత్వం రాగానే చెల్లించిందన్నారు. దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ బిల్లులను సైతం తప్పనిసరిగా చెల్లిస్తామని, నిర్మాణ సంస్థలు ఎటువంటి భయం లేకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మరో వైపు దేవదుల ప్రాజెక్ట్ పనులు 15 ఏళ్లుగా నత్తనడకలో సాగాయి. 3000 ఎకరాల భుసేకరణ చేయాల్సి వుంది. దీన్ని నవంబర్ 15 లోపు దీన్ని పూర్తి చేసి.. పనులను వేగంగా పూర్తి చేస్తాము రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఏదుర్కొంటున్న రైతులకు హామీ ఇచ్చిన మేరకు బూముల నష్టపరిహారం ఇస్తాము అని హామీ ఇచ్చారు. గోదావరి పరివాహక ప్రాంతంలో కట్టిన ప్రాజెక్టులతో ..ఉమ్మడి వరంగల్ జిల్లాతోబాటు. నల్గొండ,ఖమ్మం జిల్లాలకు పాక్షికంగా నీళ్లు అందుతాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక. దేవాదుల ప్రాజెక్ట్ కి పెద్ద పీట వేయడం జరుగుతుందన్నారు మంత్రి పొంగులేటి. 15 ఏళ్లుగా నత్తనడకలో దేవదుల ప్రాజెక్ట్ సాగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 3 లక్షల ఆయకట్టుకు 2026 సంవత్సరా లో ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దేవాదుల ప్రాజెక్ట్ ఇన్ డెప్త్‌గా పరిశీలన చేయడం జరిగిందన్నారు. 3000 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. మంత్రుల పర్యటనలో పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మంత్రి ఉత్తమ దృష్టికి తీసుకెళ్లారు. వారందరూ సూచనలను పరిగణలోకి తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. అతి త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామని అన్నారు. భూముల ధరలు పెరగడంతో భూ సేకరణ ఇబ్బందిగా మారిందని రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ కోసం ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నామన్నారు. సమ్మక్క బ్యారేజ్ ఎన్ఓసి కోసం చత్తీస్గడ్ ప్రభుత్వంతో చర్చలు జరిపి త్వరలోనే సి డబ్ల్యూ సి నుండి అనుమతులు తెచ్చుకుంటామన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికీ తెలంగాణ గ్రామీణ ముఖచిత్ర మార్చడమే లక్ష్యంగా ప్రాజెక్టును గురి చేసే విధంగా ముందుకెళ్తామన్నారు.

### శివాజీ విగ్రహం కూలిన ఘటనపై
## ప్రధాని క్షమాపణ

**మొదటి పేజీ తరువాయి...**

చేస్తున్నానని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఛత్రపతి శివాజీకి క్షమాపణలు చెప్పారు. 'ఇటీవల సింధుదుర్గ్‌లో ఏం జరిగినా, అందరికీ బాధ కలిగించిందన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ అంటే పేరు మాత్రమే కాదు, ఆయన కేవలం రాజు, మహారాజు కాదు, మనకు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆరాధనీయ దైవం. ఛత్రపతి శివాజీ మహారాజ్‌కి శిరస్సు వంచి నమస్కరిస్తూ, నివాళులు అర్పిస్తున్నాను. తన పాదాల వద్ద తలవంచి క్షమాపణలు కోరుతున్నాను.' అంటూ ప్రధాని మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. పాల్ఘర్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ, సావర్కర్ గురించి కూడా ప్రస్తావించారు. భారతమాత వీర పుత్రుడు వీర్ సావర్కర్ ను దుర్భాషలాడి దేశభక్తుల మనోభావాలను తుంగలో తొక్కే వారు ఉన్నారు. వీర్ సావర్కర్‌ను దుర్భాషలాడిన తర్వాత కూడా క్షమాపణలు చెప్పేందుకు కొందరు సిద్ధంగా లేరు అని ఆయన అన్నారు. ప్రజలకు అలాంటి విలువలు తెలియాలి. ఛత్రపతి శివాజీ మహారాజ్‌కి క్షమాపణలు చెప్పే పని చేస్తున్నానని మోదీ అన్నారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన, శక్తిమంతమైన దేశాలలో భారతదేశం ఒకప్పుడు ఉండేదన్న ప్రధాని, ఈ శ్రేయస్సుకు ప్రధాన ఆధారం భారతదేశం సముద్ర శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ శక్తి మహారాష్ట్ర కంటే మెరుగైనది, ఛత్రపతి శివాజీ మహారాజ్ సముద్ర శక్తికి కొత్త ఔన్నత్యాన్ని ఇచ్చారన్నారు. దేశ ప్రగతి కోసం ఆయన నిర్ణయాలు తీసుకున్నారని మోదీ గుర్తు చేశారు. వాధావన్ పోర్ట్ ప్రాజెక్ట్‌ను కానుకగా ఇచ్చేందుకు పాల్ఘర్ వచ్చిన ప్రధాని మోదీ, మహారాష్ట్ర పూర్తిగా అభివృద్ధి చెందుతుందని, పూర్తి వనరులు ఉన్నాయని అన్నారు. ఇక్కడ సముద్ర తీరాలు కూడా ఉన్నాయి.ఈ తీరాల ద్వారా ప్రపంచ వాణిజ్యానికి శతాబ్దాల నాటి చరిత్ర ఉంది. ఇక్కడ భవిష్యత్తు కోసం అపారమైన అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. దేశంలోనే అతిపెద్ద కంటైనర్ పోర్టుగా ఇది రూపుదిద్దుకుంటుందని తెలిపారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే గొప్ప ఓడరేవుల్లో ఇది ఒకటిగా మారనుందని ప్రధాని మోదీ తెలిపారు. డిఘి పోర్ట్ ఇండస్ట్రియల్ ఏరియా అభివృద్ధికి కూడా మా ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ప్రధాని మోదీ చెప్పారు. వాధావన్ ఓడరేవు మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో దహను పట్టణానికి సమీపంలో ఉంది. ఇది భారతదేశంలోని అతిపెద్ద ఓడరేవులలో ఒకటి. ఇది సముద్ర ప్రాంతాలలో కనెక్టివిటీని పెంచుతుంది. దీని ద్వారా ప్రపంచ వాణిజ్యం వృద్ధి చెందుతుంది. దీని మొత్తం ఖర్చు దాదాపు 76 వేల కోట్లు. ఈ నౌకాశ్రయం ఉద్దేశ్యం అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాలను సులభతరం చేయడం. దీన్ని పూర్తి చేయడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుంది. ప్రాంతం అభివృద్ధి చెందుతుంది, స్థానికులకు ఉపాధి లభిస్తుంది.




పదవీ విరమణ చేసిన హెడ్మాస్టర్ కోరని అర్జున్ ను సన్మానిస్తున్న గ్రామస్తులు

## నర్కుడ పాఠశాల హెడ్మాస్టర్ కోరటి అర్జున్ పదవి విరమణ

**ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన హెచ్ ఎం అర్జున్**

**విద్యతో పాటు సంస్కారం నేర్పిన గొప్ప వ్యక్తిగా పొందిన అర్జున్**

శంషాబాద్, ఆగస్టు30(ప్రభాత ఉదయం): శంషాబాద్ మండలం నర్కుడ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న కోరటి అర్జున్ శనివారం పదవి విరమణ చేయనున్నారు . శనివారం పదవి విరమణ చేయనున్న కొరటి అర్జున్ ను గ్రామస్తులు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు చదువుతో పాటు నడవడికలు నేర్చుకొని ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగితేనె జీవితంలో అత్యంత కీలకమైన పాత్రను పోసించగలరని నర్కుడ ప్రధానోపాధ్యాయులు అర్జున్ తెలిపారు.శుక్రవారం రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్,షాబాద్, బడంగ్ పేట్ అనేక ప్రాంతాలలో ఎంతోమంది విద్యార్థులకు విద్య నేర్పుతూ విద్యతోపాటు సమాజంలో ఎలా బ్రతకాలి అనే ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన కొరటి అర్జున్ ను తన ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవంలో నర్కుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2009-10 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చదువుకున్నప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఎంతో సంతోషపడ్డారు.ఈ కార్యక్రమంలో పదవి విరమణ పొందిన కోరటి అర్జున్ మాట్లాడుతూ...ఎంతోమంది విద్యార్థులు తన వద్ద చదువుకున్న వాళ్ళు మంచి మంచి స్థాయిలో వాలను చూసినప్పుడు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.విద్యార్థులు అందరూ తమ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆశించారు.ఈ కార్యక్రమంలో మన్నే ప్రశాంత్,వేణుచారి, వినోద్,సంతోష్, వెంకటేష్,సురేష్,విష్ణు,శ్రీను,లక్ష్మణ్,మహేష్,ప్రభు,అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టుకు సీఎం రేవంత్
## బేషరతు క్షమాపణ

హైదరాబాద్, ఆగస్ట్ 30 (ప్రభాత ఉదయం): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సుప్రీం కోర్టుకు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ విషయంలో తన కామెంట్లు న్యాయవ్యవస్థను ప్రశ్నించినట్టు ఆపాదించారని ఈ ట్వీట్‌లో వెల్లడించారు. వార్తాపత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. భారత న్యాయవ్యవస్థపై తనకు అత్యంత విశ్వాసం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన రేవంత్.. శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. 'నా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్లుగా కొందరు ఆపాదించారు. పత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా. న్యాయవ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల నాకు అపార గౌరవం, విశ్వాసం ఉన్నాయి. రాజ్యాంగం, దాని విలువలను విశ్వసించే నేను.. ఎన్నటికీ న్యాయవ్యవస్థను అత్యున్నతమైనదిగా భావిస్తూనే ఉంటా' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ముఖ్యమంత్రి ప్రకటనలను ఈ రోజు పత్రికల్లో చదివాం. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి చేయాల్సిన వ్యాఖ్యలేనా అవి? మేం రాజకీయపార్టీలను సంప్రదించో.. లేక రాజకీయాంశాల ఆధారంగానో ఉత్తర్వులిస్తామా?' అని ధర్మాసనం తీవ్రంగా ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై తాజాగా స్పష్టతనిచ్చారు.



## పురుగుల అన్నం, నీళ్ల చారు తినలేమంటూ రోడ్డెక్కిన విద్యార్థులు

**సీఎం రేవంత్ రెడ్డి వచ్చి సమస్యలు పరిష్కరించాలి**

**పాలమాకుల గురుకుల పాఠశాల విద్యార్థుల ఆందోళన.**

**పాఠశాలను సందర్శించిన డీఈవో సుశింధర్ రావు.**

శంషాబాద్, ఆగస్టు 30(ప్రభాత ఉదయం) ప్రతిరోజు పెడుతున్న పురుగుల అన్నం నీళ్ల చారు తినలేమంటూ శంషాబాద్ లోని పాలమాకుల ఆదర్శ పాఠశాల విద్యార్థినీలు శుక్రవారం రోడ్డుపై బైఠాయించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని పాలమాకుల లో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థినీలు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై దాదాపు మూడు గంటలు బైఠాయించారు. రంగారెడ్డి జిల్లా డీఈవో సుసింధర్ రావు వచ్చి విద్యార్థులతో సంప్రదించి వారి ఆందోళన విరమింప చేశారు. ఆదర్శ పాఠశాలలో గత కొంతకాలంగా విద్యార్థులకు సరైన భోజన వసతి కల్పించడం లేదని ప్రతిరోజు పురుగుల అన్నం. నీళ్ల చారుతో కడుపు నింపుకోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై శుక్రవారం సంబంధిత ఉపాధ్యాయులను విద్యార్థులు నిలదీయడంతో కోపోద్రిక్తులైన ఉపాధ్యాయులు ఓ విద్యార్థి కంట్లో కారం చల్లారు. దీనితో తీవ్ర ఆగ్రహానికి గురైన విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి బైఠాయించారు. దాదాపు మూడు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేయడంతో శంషాబాద్ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ నాయక్ వచ్చి వారిని బుజ్జగించడానికి ప్రయత్నించినప్పటికీ వారు పట్టించుకోలేదు. స్టడీ అవర్స్ లో సైతం ఉపాధ్యాయులు స్నాక్స్ తింటూ టిఫిన్లు చేస్తూ కాలయాపన చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశింధర్ రావుకు సమాచారం అందించగా ఆయన వెంటనే ఇక్కడికి తరలివచ్చారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇకపై ఎలాంటి పొరపాట్లు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. తరచుగా పై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తారని వారికి సూచించారు. విద్య బోధనలో సైతం జరుగుతున్న ఇబ్బందులను తీర్చుతామని అన్నారు.

# రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం. సుగుణ తో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక



మధ్యాహ్న భోజనం ను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

బుద్వేల్, ఆగస్టు30(ప్రభాత ఉదయం) : రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక శుక్రవారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు ఎలాంటి భోజనం పెడుతున్నారు ....భోజనం బాగుందా... అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుషిందర్ రెడ్డి, రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ లు ఉన్నారు. మధ్యాహ్న భోజనం అక్షయ పాత్ర నుంచి వస్తుందని... చాలా బాగుందని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. డైనింగ్ హాల్ షెడ్ పూర్తి కాకపోవడాన్ని గమనించిన కలెక్టర్ పనులు ఎందుకు ఆగిపోయాయని అడిగారు . దానికి ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం. సుగుణ సమాధానమిస్తూ కాంట్రాక్టర్ కు బిల్లులు రానందున పనులు మధ్యలోనే ఆపాడని తెలిపారు . దీంతో కలెక్టర్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులని పిలిపించి మాట్లాడారు . పాఠశాల మైదానంలో రాళ్ళు ఉండడంతో మైదానం ను చదును చేసి విద్యార్థులకు ఆడుకునేలా చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు . విద్యార్థులతో ఆయన ముచ్చటించారు . చదువు ఎలా చెబుతున్నారని అడిగి తెలుసుకున్నారు . కొంత మంది విద్యార్థులు చాలా బలహీనంగా కనిపించడంతో విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తున్నారా.. అని ప్రధానోపాధ్యాయులు ను అడిగి తెలుసుకున్నారు . దానికి ఆమె చేయిస్తున్నామని తెలిపారు. డాక్టర్లను పిలిచి పరీక్షలు చేయడంతోనే కాదు వారి కుటుంబ సభ్యులకు తెలిపి బలహీనంగా ఉన్న విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు జరిపించాలని సూచించారు . అనంతరం గదులు ఉన్నట్లయితే సైన్స్ ల్యాబ్ కోసం పరికరాలు, లైబ్రరీ కోసం పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. ఏ ఏ పరికరాలు కావాలో రాసి ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు . తాను తిరిగి రెండు నెలల తర్వాత పాఠశాలకు వస్తానని అంతలోపు అన్ని పనులు పూర్తి కావాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. అక్కడి నుంచి ఆయన కిస్మత్ పూర్ లోని కస్తూర్బా బాలికల పాఠశాలకు వెళ్లారు . అక్కడ ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు . విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. భోజన వసతి తో పాటు చదువు నాణ్యత గా ఉండాలన్నారు.



టీఎన్జీవోస్ కాలనీ లో కూల్చివేత లు చేపడుతున్న సిబ్బంది

## జీహెచ్ఎంసీకి కేటాయించిన స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాల కూల్చివేత

బుద్వేల్, ఆగస్టు30(ప్రభాత ఉదయం): కాటేదాన్ టీఎన్జీవోస్ కాలనీ సర్వేనెంబర్ 156/1 లో జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కు కేటాయించిన 3,000 గజాల స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన గదులను శుక్రవారం అధికారులు కూల్చివేశారు. కాటేదాన్ టీఎన్జీవోస్ కాలనీలో ఇప్పటికే పార్కులు, ఓపెన్ స్థలాలు దాని పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన భూ బకాసురులు అది చాలదన్నట్లు జీహెచ్ఎంసీ కి కేటాయించిన స్థలాన్ని కూడా కబ్జా చేయాలనే పథకంతో గదులు నిర్మించారు. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ నేతృత్వంలో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు . ఇకముందు జీహెచ్ఎంసీ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేయాలని ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.





## ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు

కూకట్‌పల్లి, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం) మాజీ మంత్రి, రాయలసీమ ముద్దుబిడ్డ, స్వర్గీయ పరిటాల రవీంద్ర జయంతిని పురస్కరించుకొని అట్లూరి దీపక్ ఆధ్వర్యంలో శుక్రవారం జే ఎన్ టి యు సర్కిల్ ఎన్ టి ఆర్ విగ్రహం వద్ద ఆ మహనీయుడి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కె సత్తార్, రవి చెరుకూరి, ఎన్ ఎస్ రాజు, రేఖ, పవన్ మూర్తి, కొండల్ రావు, విక్రం సిం హా, కిషోర్ కొర్రపాటి, ఘంటా హేమంత్, సందీప్ వర్మ, మదన్ మోహన్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమానులు పాల్గొన్నారు.

## పాలమాకుల కస్తూర్బా బాలికల వసతి గృహం సంఘటన పై విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి : లక్ష్మీరాజ్



బుద్వేల్, ఆగస్టు30(ప్రభాత ఉదయం): పాల్మాకులలోని కస్తూర్బా బాలికల వసతి గృహంలో విద్యార్థినీలకు సరైన భోజనం పెట్టక, ప్రశ్నిస్తే వారిని కొడుతున్న ఉపాధ్యాయులు, వార్డెన్ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీరాజ్ డిమాండ్ చేశారు. తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్లో ఉండి చదువుకోవడానికి వచ్చిన విద్యార్థినీల పట్ల ఉపాధ్యాయులు దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. దీనిపై అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు.

## పోలీసుల నుంచి తప్పించుకోబోయి రెండో అంతస్తు పై నుంచి దూకిన వ్యక్తి దుర్మరణం

బుద్వేల్, ఆగస్టు30(ప్రభాత ఉదయం) : పలు కేసులతో సంబంధం ఉన్న వ్యక్తికి వారెంట్ ఇష్యూ కావడంతో పంజాగుట్ట పోలీసులు శుక్రవారం రాత్రి అతని ఇంటికి వచ్చారు. పోలీసులను గమనించిన వ్యక్తి రెండవ అంతస్తు పైనుంచి కింద దూకి తప్పించుకుందామనే ప్రయత్నంలో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు . వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అప్సరుద్దీన్( 55) అనే వ్యక్తికి గోల్కొండలో, బండ్లగూడ సన్ సిటీ లో రెండు ఇండ్లు ఉన్నాయి. అతనిపై నగరంలో 10 వరకు కేసులు ఉన్నాయి. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో ఉన్న ఓ కేసుకు సంబంధించి వారెంట్ ఉండడంతో శుక్రవారం రాత్రి పోలీసులు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడ సన్ సిటీ ప్రాంతంలో నివాసం ఉండే అప్సరుద్దీన్ ఇంటికి వచ్చారు. పోలీసులు ఇంటి బయట ఉండటాన్ని గమనించి తలుపులు కూడా తీయకుండా వెనకాల వైపుకు వెళ్లి రెండంతస్తులపై నుంచి దూకి తప్పించుకుందామనుకున్నాడు. ఈ ప్రమాదంలో అప్సరుద్దీన్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు . సంఘటన స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.




## కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎం కృష్ణ

కొత్తకోట, ఆగస్టు 30(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కొత్తకోట సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా ఎం. కృష్ణ ఈ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ... ప్రజలకు ప్రతిష్టమైన భద్రత కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తుల పట్ల ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి ప్రజలకు భద్రత కల్పిస్తామన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిఖ్ సంఘం ప్రతినిధులు

## ఎమర్జెన్సీ సినిమాను ముందే నిలిపివేయాలని మంత్రికి వినతి

### గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా సాహెబ్ ప్రెసిడెంట్ ఎస్ ఇందర్ సింగ్

రాజేంద్రనగర్,ఆగస్టు30(ప్రభాత ఉదయం):ఎంపీ కంగన రౌత్ చిత్రీకరించిన సినిమాలో సిక్కుల మనోభావాలు దెబ్బ తినే విధంగా ఉన్నందున ఎమర్జెన్సీ సినిమాను ఈనెల 5వ తేదీన విడుదలకు ముందే నిలిపివేయాలని గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా సాహెబ్ ప్రెసిడెంట్ ఎస్ ఇందర్ సింగ్ తెలిపారు.శనివారంసెంట్రల్ గురుద్వారా సాహెబ్ గౌలిగూడ తెలంగాణకు చెందిన సిక్కు సంఘం "ఎమర్జెన్సీ" సినిమాపై నిషేధం విధించాలని తెలంగాణ ప్రభుత్వం రోడ్లు,భవనాల శాఖ మంత్రి,సినిమాటోగ్రఫీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరడం జరిగిందని ఆయన సూచించారు.అంతేకాకుండా పార్లమెంటరీ సభ్యురాలు కంగనా రనౌత్ దర్శకత్వం వహించి నిర్మించారని ఆయన ఆరోపించారు.ఎమర్జెన్సీ,సిక్కుల చరిత్రను తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు.అభ్యంతరకరకర సన్నివేశాలు సిక్కుల మనోభావాలను వేటాడతాయి.అనేక సిక్కు వ్యతిరేక దృశ్యాలు,సిక్కు సమాజం మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయి.సిక్కును తీవ్రవాదులుగా,వేర్పాటువాదులుగా చూపించే ప్రయత్నం జరిగిందన్నారు.ఇది ఆమోదయోగ్యం కాదు,నిజం కాదు.మతపరమైన వివక్ష కారణంగా సిక్కు కమ్యూనిటీకి చెందిన వ్యక్తులు హిందూ సమాజానికి చెందిన వ్యక్తులపై విచక్షణారహితంగా కాల్పులు జరుపుతున్నట్లు చూపబడిందని తెలిపారు.పార్లమెంటు సభ్యురాలు కంగనా రనౌత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు,ఇందులో ఆమె నిరసనలో పాల్గొన్న రైతులను "హంతకులు,రేపిస్టులు" అని పేర్కొన్నారు.ఈ అవమానకరమైన,నిరాధారమైన ప్రకటనలు అత్యంత ఖండించదగినవి మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని సూచించారు.రైతులే మన జాతికి వెన్నెముక,మొత్తం జనాభాకు ఆహారం అందించడానికి అవిశ్రాంతంగా శ్రమించే నిజమైన "అన్నదాత". సమాజంలో వారి పాత్ర పవిత్రమైనది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఎమర్జెన్సీ సినిమాను నిలుపుదలకు కోరడంతో బిజెపి పార్టీకి ప్రభుత్వానికి ఈ సినిమాతో ఎలాంటి సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వం పెద్దలు తెలపడంతో చాలా విడ్డూరంగా ఉందని ఆయన ఆరోపించారు.అటువంటి బాధ్యతారాహిత్యమైన,ఉద్వేగభరితమైన భాషతో వారి ప్రతిష్టను కించపరిచే ఏ ప్రయత్నమూ ఆమోదయోగ్యం కాదు.రైతుల నిరసన అనేది మన దేశ ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించే ఒక ముఖ్యమైన ఉద్యమం,ఇక్కడ పౌరులు అన్యాయంగా భావించే విధానాలకు వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించే హక్కు ఉంది.తెలంగాణకు చెందిన సెంట్రల్ గురుద్వారా సాహెబ్ గౌలిగూడ,సిక్కు సంగత్ సిక్కు-హిందూ రెండు వర్గాల సోదరభావాన్ని కొనసాగించడానికి "ఎమర్జెన్సీ" చిత్రాన్ని నిషేధించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరుతున్నారు.దీనికి స్పందిస్తూ మంత్రి మాట్లాడుతూ...ఎమర్జెన్సీ సినిమా నిలుపుదలకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిక్క్ చవుని గురుద్వారా సాహెబ్ బారంబరాల ఛైర్మెన్ హర్భజన్ సింగ్,అడ్వైజర్ ఎగ్ బాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ఓ బాలిక మరణానికి కారణమైన బాలున్ని జువనైల్ హోమ్‌కు తరలించిన పోలీసులు

బుద్వేల్, ఆగస్టు30(ప్రభాత ఉదయం):స్నాప్ చాటింగ్ ద్వారా పరిచయమై ఓ బాలికను వేధించడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి..... షాద్ నగర్ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన ఒక కుటుంబం బ్రతుకుతెరువు కోసం వచ్చి కాటేదాన్ దుర్గా నగర్ లో నివాసం ఉంటున్నారు. వారికి ముగ్గురు సంతానం . పెద్ద కుమార్తె శివరాంపల్లిలోని ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఆ బాలిక ఈనెల 17న దుర్గా నగర్ లోని తమ ఇంట్లో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన సోదరీలు విషయాన్ని పనికి వెళ్లిన అమ్మానాన్నలకు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు వచ్చి ఆ బాలిక మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లి 18వ తేదీన సమాధి చేశారు. ఆ బాలిక తండ్రి నా కూతురు ఎందుకు ఆత్మహత్య చేసుకుంది.... కారణాలేంటని ఆలోచించడం మొదలు పెట్టాడు. అందులో భాగంగా కూతురు చదువుతున్న కాలేజీకి వెళ్లి నా కుమార్తె మరణించింది అని, ఆమె ను ఎవరైనా ఏడిపించే వారా... ఎవరితోనైనా మాట్లాడేదా అని ఆరా తీశాడు. దానికి కళాశాల యాజమాన్యం అలాంటిదేమీ లేదని తెలిపారు. ఒకసారి ఫోన్ చెక్ చేయమని చెప్పగా కూతురు ఫోన్లో ఒక ఫోన్ నెంబర్ నుంచి చాటింగ్ చేశారని కనుగొన్న తండ్రి వివరాలు సేకరించాడు. సదరు ఫోన్ నెంబర్ ఉన్న వ్యక్తి మహేశ్వరం ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించారు. దీంతో ఆత్మహత్య చేసుకున్న బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కూతురు ను వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు . దీంతో పోలీసులు విచారణ జరిపారు. స్నాప్ చాటింగ్ లో పరిచయమైన బాలుని ఆచూకీ కనుగొన్నారు. అతని నుంచి వివరాలు సేకరించాక బాలిక మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు . బాలిక మరణానికి కారణమైన బాలున్ని మైలార్ దేవ్ పల్లి పోలీసులు శుక్రవారం జువనైల్ హోమ్ ముందు ప్రవేశపెట్టారు



## పేద ప్రజల జోలికొస్తే సహించేది లేదు: ఎమ్మెల్యే కృష్ణా రావు

### కక్ష సాధింపులు నిరుపేదల పైన కాదు, బడా బాబుల పైన చూపించండి...

### కాంగ్రెస్ హయాంలో ఏర్పడిన రాజీవ్ గాంధీ నగర్ కు హైడ్రా నోటీసులు అందించడం హాస్యాస్పదం...

కూకట్‌పల్లి, ఆగస్ట్ 30 (ప్రభాత ఉదయం) కూలీలకు వెళ్లి కష్టం చేసుకుంటూ 40 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న పేద ప్రజల జోలికొస్తే ఊరుకునేది లేదని కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ స్థానిక కార్పొరేటర్ సభిహా గౌసుద్దీన్ తో కలిసి ఆయన హైడ్రా నోటీసులు ఇచ్చిన కుటుంబాలను కలిశారు. స్థానిక కాలనీవాసులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నివాసాలు ఉంటూ జీవనం గడుపుకుంటున్న తమ కడుపును కొట్టి ఇండ్లను కూల్చి వేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో రాజీవ్ గాంధీ నగర్ కాలనీ ఏర్పాటు జరిగిందని అదే సమయంలో సబ్దర్ నగర్, పద్మావతి నగర్ ప్రాంతాలలో ఇండ్లు కట్టుకొని నివాసాలు ఉండేవారని తెలిపారు. అప్పటినుంచి కూలీలకు వెళ్లి కష్టం చేసుకుని జీవిస్తున్న నిరుపేద కుటుంబాలు జీవనం గడిపే ప్రాంతాలైన ఈ కాలనీలలో కొంతమంది రిజిస్ట్రేషన్లు చేసుకున్న ఇండ్లకు సైతం హైడ్రాధికారులు నోటీసులు జారీ చేయడం బాధాకరమైన విషయమని తెలిపారు. హైడ్రాధికారులకు బడా బాబులు చెరువులు కుంటలు కబ్జాలు చేసి భవంతులు నిర్మించుకుంటే వాటిని కూలగొట్టడం మర్చిపోయి పేదవారు నివసించే ప్రాంతాలలో కూల్చివేతలు చేపట్టడం సరికాదన్నారు . కొంతమంది రాజకీయ నాయకులు, పార్టీ లీడర్లతో ఫోటోలు దిగి స్థానికంగా బిల్డింగ్ల దగ్గర లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని అలాంటి వారి పైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుపేదలు నివసించే ప్రాంతాలలో హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చి ప్రజలను నిద్ర లేకుండా భయభ్రాంతులకు గురి చేయడం సరైనది కాదని ఇలాంటి చర్యలకు పాల్పడితే పేద ప్రజలు తిరగబడతారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



రాజేంద్రనగర్, ఆగస్ట్ 30(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హాతిరామ్ తెలిపారు. ఈ సెక్షన్ పరిధిలోని ఉప్పరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు ఫోర్ట్ వ్యూ కాలనీ, పరమారెడ్డి హిల్స్, హ్యాపీ హోమ్స్ కాలనీ, అశోక్ విహార్, జన చైతన్య ఫేస్ టు, పరిసర ప్రాంతాలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి సహకరించగలరని ఆయన వినియోగదారులను కోరారు.

**నార్సింగి లో...**

నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలో గల ఆంతాలైన నార్సింగి సర్జన్ సింగ్ లేఅవుట్ క్యూబా మజీద్ నర్సింగీ హైట్స్ వివేకానంద నగర్ పరిసర ప్రాంతాలు, అపర్ణ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన ప్రైవేట్ 38 విలాస్ గోల్డ్ ఫిష్ నియో పోలీస్ మూవీ టవర్ పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి మూడు గంటల వరకు, ఇబ్రహీంబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇతర మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు మన దేవుడు కూడా నెక్నాపూర్ ఫెయిర్ ఫీల్డ్ కాలనీ ఇవి కాలనీ మోర్ నగర్ పనీర్ ఎస్టేట్ పరిసర ప్రాంతాలు,బాలాజీ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటలనుండి 11:30 వరకు మంచిరేవుల బాలాజీ నగర్ గ్రీన్ ల్యాండ్స్, లెజెండ్ చిమెస్, ప్రాంతాలలో ఉదయం 10:00 నుండి 11:30 వరకు, బాబు ఖాన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి 1:00 వరకు కోకాపేట్ గ్రామం 250 యార్డ్స్ బాబు ఖాన్ విల్లాస్ , జి ఏఆర్, కృష్ణ గోశాల విద్యుత్ ఫీడర్, కోకాపేట్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి 1:00 వరకు కృష్ణ గో సేవ 7 హిల్స్ రోడ్ , వెస్ట్ నెఫ్ మెడోస్, ఎన్ సి సి- 1, జయభేరి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం 4:30 వరకు వట్టినాగులపల్లి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ అన్వయ కన్వెన్షన్ రోడ్డు తులసి ఎంక్లేవ్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి కోరారు.

# కొత్త ఎనర్జీతో కల్కి-2 పార్ట్

## మరో ఆరు నెలల్లో షూటింగ్ ప్రారంభిస్తాం




పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన తాజా బ్లాక్ బస్టర్ 'కల్కి'. వైజయంతి మూవీస్ బ్యానర్‌లో వచ్చిన ఈ చిత్రం జూన్ 27న విడుదలై సూపర్‌హిట్ అందుకోవడమే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రికార్డులను సృష్టించింది. ఇదిలావుంటే ఈ సినిమాకు సీక్వెల్ ఉందని నాగ్ అశ్విన్ ప్రకటించిన విషయం తెలిసిందే. సీక్వెల్‌ను అయితే ప్రకటించారు కానీ ఎప్పుడు మొదలుపెట్టనున్నారు అనేది మాత్రం వెల్లడించలేదు.అయితే తాజాగా కల్కి 2 సినిమా షూటింగ్‌కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు నిర్మాతలు స్వప్నదత్, ప్రియాంకదత్‌లు. వీరిద్దరూ.. మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ వీక్‌లో పాల్గోని అక్కడి మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ క్రమంలోనే మూవీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఈ మూవీ షూటింగ్ అప్‌డేట్‌పై నిర్మాత ప్రియంకా దత్ మాట్లాడుతూ.. కల్కి 2 షూటింగ్ మరో ఆరు నెలల్లో మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. ఒక్కసారి మూవీ షూటింగ్ స్టార్ట్ అయితే వరుస అప్‌డేట్‌లను ఇస్తాం అని తెలిపారు. స్వప్నా దత్ మాట్లాడుతూ.. మొదటి పార్ట్ కంటే ఈ మూవీ కోసం ఎక్కువగా ఇంట్రెస్ట్‌గా ఉన్నాం. కల్కి నుంచి చాలా నేర్చుకున్నాం. కొత్త ఎనర్జీతో కల్కి 2ను మొదలుపెట్టబోతున్నాం అంటూ చెప్పుకోచ్చింది.



# ఆ వ్యాఖ్యలు పుష్పను ఉద్దేశించి కాదు

## పవన్ వ్యాఖ్యలపై నిర్మాత రవిశంకర్ క్లారిటీ



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గత నెల బెంగళూరు పర్యటనలో ఉన్నప్పుడు అడవుల నరికివేతపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇంతకుముందు సినిమాల్లో హీరోలు అడవులని కాపాడేవారు. కానీ ఈరోజుల్లో గొడ్డళ్లు పట్టుకొని, స్మగ్లింగ్ చేయడం అడవులను నరికివేయడం హీరోయిజం అయిపోయింది. నేను ఆ పరిశ్రమలో ఉన్నానని అలోచించుకుంటే అప్పుడప్పుడు బాధగా అనిపిస్తుంటుంది. ఇలాంటివి తగ్గి మళ్లీ అడవుల ప్రాముఖ్యత తెలిసేలా సినిమాలు రావాలని పవన్ కళ్యాణ్ చెప్పారు. అయితే పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అల్లు అర్జున్‌ను ఉద్దేశించి చేసినవే అంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు. అల్లు అర్జున్ నటిస్తున్న పుష్ప సినిమాలో గొడ్డళ్లు పట్టుకొని, స్మగ్లింగ్ చేయడం అడవులను నరికివేయడం లాంటివి ఉండడంతో కావాలని వ్యాఖ్యలు చేస్తున్నాడని అల్లు ఫ్యాన్స్ పవన్‌పై విమర్శలు గుప్పించారు. ఇదిలావుంటే తాజాగా ఈ వివాదంపై ఉస్తాద్ భగత్ సింగ్ నిర్మాత రవిశంకర్ క్లారిటీ ఇచ్చాడు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు అల్లు అర్జున్ ? 'పుష్ప 2'ను ఉద్దేశించి కాదని క్లారిటీ ఇచ్చారు. పవన్ అలా ఎప్పుడు మాట్లాడరని.. మెగా ఫ్యామిలీ అంతా ఒక్కటే అని చెబుతాడని చెప్పుకోచ్చాడు. ఇక ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా గురించి మాట్లాడుతూ.. ఈ మధ్యే పవన్ కళ్యాణ్‌ను కలిశాను. త్వరలోనే 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది జనవరి నాటికి షూటింగ్ పూర్తి చేయాలి అనుకుంటున్నాం. సెప్టెంబర్ 2 పవన్ బర్త్‌డే నాడు ఓ సర్‌ప్రైజ్ కచ్చితంగా ఉండబోతుంది అంటూ రవి శంకర్ చెప్పుకోచ్చాడు.

## పాట రాసాను.. పాడాను అంటున్న ఫరియా

శ్రీసింహా హీరోగా రానున్న చిత్రం 'మత్తు వదలరా 2' రితేశ్ రానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో ఫరియా అబ్దుల్లా కీలక పాత్రలో కనిపించనున్నారు. సెప్టెంబర్ 13న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈసందర్భంగా మీడియాతో మూవీ టీమ్ ముచ్చటించింది. 'నేను వర్క్ చేసిన టీమ్‌లలో ఇది బెస్ట్. షూటింగ్ చాలా సరదగా జరిగింది. ఈ సినిమా కోసం నేను ఓ పాట రాశాను. దాన్ని నేనే పాడి కొరియోగ్రఫీ చేశాను. కొత్తగా ఉంటుంది. ఎంజాయ్ చేస్తారు' అని ఫరియా అన్నారు. 'మత్తు వదలరా'తో నేను ఇండస్ట్రీకి వచ్చాను. 5 ఏళ్ల తర్వాత దాని సీక్వెల్‌కు వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి సినిమాలు తక్కువగా వస్తుంటాయి. ఫస్ట్ పార్ట్‌కు థియేటర్‌లోనే కాకుండా ఓటీటీలోనూ మంచి ఆదరణ లభించింది. దీని సీక్వెల్‌ను అలానే ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని కాలభైరవ చెప్పారు. మొదటిభాగం అంచనాలకు మించి విజయం సాధించిందని శ్రీసింహా ఆనందం వ్యక్తంచేశారు.

# నా సినిమాకు సెన్సార్ బోర్డ్ సర్టిఫికేట్ ఇవ్వట్లేదు: కంగనా రనౌత్



బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఎమర్జెన్సీ'. దివంగత భారత ప్రధాని ఇందిరాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో ఇందిరాగాంధీగా కంగనా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం గతేడాది నవంబరు 24న విడుదల కావాల్సి ఉండగా.. అనుకోని కారణాల వలన విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత జూన్ 14న విడుదల చేయానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ క్రమంలోనే కంగనా పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం హిమచల్ ప్రదేశ్ 'మండి' నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటి చేసి గెలవడంతో రాజకీయల్లో బిజీ అయ్యి ఈ సినిమా మళ్లీ వాయిదా పడింది. ఇప్పుడు ఈ సినిమాను సెప్టెంబర్ 06న విడుదల చేయనున్నట్లు కంగనా అనౌన్స్ చేసింది. విడుదల తేదీ దగ్గర పడటంతో ఇప్పటికే వరుస ప్రమోషన్స్‌లో పాల్గోంటుంది కంగనా. అయితే విడుదలకు ఇంకా వారం రోజులు ఉన్న క్రమంలో సెన్సార్ బోర్డ్‌పై సంచలన వ్యాఖ్యలు చేసింది కంగనా. 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ బోర్డ్ ఇంకా సర్టిఫికేట్ ఇవ్వట్లేదని తెలిపింది.త్వరలోనే మా సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంటుందని ఆశిస్తున్నా. సెన్సార్ బోర్డులో చాలా సమస్యలు ఉన్నాయి. మేము 'ఎమర్జెన్సీ' సినిమా సెన్సార్ సర్టిఫికేట్ కోసం వెళ్లినప్పుడు కొంతమంది వ్యక్తులు డ్రామా క్రియేట్ చేశారు. నేను సెన్సార్ బోర్డ్‌ను నమ్ముతున్న. కానీ వాళ్లు నా సినిమాకు వాళ్లు సర్టిఫికేట్ ఇవ్వడం లేదు. సర్టిఫికేట్ జారీ చేయడంలో ఆలస్యం చేస్తున్నారు. నా సినిమా కోసం నేను పోరాటం చేయడానికి రెడీగా ఉన్నా. అందుకోసం కోర్టు వరకు వెళ్లడానికి అయిన సిద్ధం అంటూ కంగనా చెప్పుకోచ్చింది. మరోవైపు ఈ సినిమాను తెలంగాణలో నిషేధం విధించే అవకాశాలున్నాయన్న వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఎమర్జెన్సీ సినిమా రిలీజ్‌పై ప్రభుత్వం న్యాయపరమైన సంప్రదింపులు జరుపుతూ.. నిషేధం అంశాన్ని పరిలిస్తుందని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. మాజీ ఐపీఎస్ అధికారి తేజ్ దీప్ కౌర్ మీనన్ నేతృత్వంలోని తెలంగాణ సిక్కు సొసైటీ ప్రతినిధుల బృందం షబ్బీర్‌ను కలిసి ఎమర్జెన్సీ విడుదలపై నిషేధం విధించాలని కోరింది. సిక్కు సొసైటీ ప్రతినిధులు సినిమాలో సిక్కు సమాజాన్ని చూపించిన తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో.. రాష్ట్రంలో సినిమాను నిషేధించే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డిని షబ్బీర్ కోరినట్టు సమాచారం.

# ఐశ్వర్యతో ఆన్‌స్క్రీన్ బాగా ఉంటుంది: విక్రమ్

విక్రమ్ నటించిన తాజా చిత్రం 'తంగలాన్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ తో వర్కింగ్ గురించి విక్రమ్ స్పందించారు. ఆమె తనకు మంచి మిత్రురాలన్నారు. ఆమె కంటే ఎక్కువగా అభిషేక్ బచ్చన్‌తోనే తనకు మంచి అనుబంధం ఉందని చెప్పారు. తమ కాంబోలో వచ్చిన రెండు చిత్రాల్లోనూ ముగింపు బాధాకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. 'అభిషేక్ బచ్చన్ నాకు క్లోజ్ ఫ్రెండ్. దానివల్ల ఆయన కుటుంబసభ్యులతోనూ నాకు మంచి అనుబంధం ఉంది. ఐశ్వర్యరాయ్ మంచి మిత్రురాలు. ఆమె గొప్ప నటి. మా మధ్య చక్కని ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఉంది. సినీప్రియులు దానిని ఆస్వాదిస్తుంటారు. ఇప్పటివరకూ మా కాంబోలో 'రావన్', 'పొన్నియిన్ సెల్వన్' చిత్రాలు వచ్చాయి. ఆయా చిత్రాల్లో మా పాత్రల ప్రేమకథకు సరైన ముగింపు ఉండదు. రెండు చిత్రాల్లోనూ ఆమె వేరే వ్యక్తి భార్యగా కనిపిస్తారు. చివరకు నా పాత్ర మృతి చెందుతుంది. అది ఫ్యాన్స్‌ను బాధకు గురిచేస్తుంది. ఇదే విషయంపై దర్శకుడు మణిరత్నంను నేను రిక్వెస్ట్ చేశా. మా ఇద్దరి పాత్రలకు సంతోషకరమైన ముగింపు ఇచ్చేలా ఒకే ఒక్క సినిమా చేయమని అడిగా. దానివల్ల అభిమానులు ఆనందపడతారని చెప్పా' అని విక్రమ్ తెలిపారు. విక్రమ్ - అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్యరాయ్ కాంబోలో తెరకెక్కిన తొలి చిత్రం 'రావన్' మణిరత్నం దర్శకత్వం వహించారు. ఈ సినిమా క్లైమాక్స్‌లో విక్రమ్ పాత్ర మృతి చెందుతుంది. ఇదే కాంబోలో ఇటీవల వచ్చిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్' చోళుల వైభవం, ఆ సామ్రాజ్య పతనానికి కారణమైన విషయాలను తెలియజేస్తూ దీనిని రూపొందించారు. ఇందులో ఆదిత్య కరికాలన్‌గా విక్రమ్, నందినిగా ఐశ్వర్యరాయ్ నటించారు. ఇద్దరూ ప్రేమించుకున్నప్పటికీ అనివార్య కారణాల వల్ల నందిని మరో వ్యక్తిని పెళ్లాడాల్సి వస్తుంది. ఆదిత్య కరికాలన్ పాత్ర మృతితో ఈ సినిమా ముగుస్తుంది. 'తంగలాన్' విషయానికి వస్తే.. ఆగస్టు 15న ఈ చిత్రం దక్షిణాదిలో విడుదలై మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈనేపథ్యంలోనే శుక్రవారం దీనిని హిందీలో విడుదల చేశారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.